క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. మారుమూల గ్రామాల్లో దేవాలయాలు నిర్మించి పూజలు చేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: దేవునిపల్లి గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. శనివారం స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ ఉత్సావాల్లో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివ శంకర్‌గౌడ్, సర్పంచ్ చేగూరి రాఘవేందర్‌గౌడ్, కుమారస్వామి, రాజేందర్‌గౌడ్, రాజేశ్‌గౌడ్, రవీందర్‌గౌడ్, బసప్ప, నరేశ్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్



విద్యార్థినికి నోటు పుస్తకాలు అందజేస్తున్న భీంభరత్

శంకర్‌పల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి పామేన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని దొంతాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన అజీజ్ శానిటైజర్, మాస్కులు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగులు, అత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వై ప్రకాష్ గుప్తా, సర్పంచ్ అశ్వినిసుధాకర్, జాన్, మహ్మద్, మహబూబ్, హుస్సైన్, నయిం, బద్దం కృష్ణారెడ్డి, బీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీ సేవల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు ఆట పాటలు, భజనలతో స్వామి వారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతి రావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజలు చేశారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22న దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లతా శ్రీశైలంగౌడ్, లక్ష్మణ్, క్యాసెట్ శ్రీనివాస్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, కిషన్ నాయక్, నారాయణ, జనార్దన్‌రెడ్డి, పద్మా పాల్గొన్నారు.

పల్లె దవాఖాన ప్రారంభమెప్పుడో?

- ఏడాది క్రితమే నిర్మాణం పూర్తి
- కరెంటు కనెక్షన్ లేక ప్రారంభించని వైనం
- పట్టించుకోని అధికారులు



చిలుకూరులోని పల్లె దవాఖాన

మొయినాబాద్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని నిర్మించిన పల్లె దవాఖాన ప్రారంభానికి నోచుకోవడం లేదు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా కరెంటు కనెక్షన్ ఇవ్వడం లేదు. ఈ సాకుతో అధికారులు దవాఖాన ప్రారంభించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో సంవత్సర కాలంగా కొత్త ఈ దవాఖాన తెరుచుకోవడం లేదు. మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరులో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ఉంది. కొన్నేళ్లుగా గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఓ చిన్న గదిలో సబ్‌సెంటర్‌ను నిర్వహించేవారు. రోగులకు నాణ్యమైన చికిత్స అందించేందుకు రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్‌సెంటర్ కోసం కొత్త భవన నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. దీని కోసం నిధులు కూడా మంజూరు చేసింది. చిలుకూరు బస్టాప్ పక్కనే విశాలమైన ప్రదేశంలో సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయి దాదాపు ఏడాది గడిచినా ఇప్పటి వరకు దాన్ని ప్రారంభించడంలేదు.

నిధుల కొరత..

చిలుకూరులో పల్లె దవాఖాన పేరుతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి కరెంటు కనెక్షన్ ఇవ్వడంలేదని, అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. భవన నిర్మాణం పూర్తయినా అందులో కరెంటు ఫిట్టింగ్ చేయలేదు. ఈ కారణంగానే భవనాన్ని ప్రారంభించలేకపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆరు నెలల క్రితం జిల్లా వైద్యాధికారి చిలుకూరు పల్లె దవాఖాన భవనాన్ని పరిశీలించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఐనప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో మండల ప్రజలు ఈ ఆరోగ్యకేంద్రం ఎప్పుడు ప్రారంభమవుతుందోనని అధికారులను ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం దీన్ని పట్టించుకుంటుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ముగిసిన జేపీదర్గా ఉర్సు



కొండల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, నాయకులు

దర్గాను దర్శించుకున్న సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి

కొత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం ముగిసింది. చివరి రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి బాబాను దర్శించుకున్నారు. అనంతరం బాబాకు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో దర్గా అభివృద్ధి జరగలేదన్నారు. దర్గా హుండీ టెండర్ల నుంచి వక్ఫ్ బోర్డుకు ప్రతీ సంవత్సరం రూ. కోట్లల్లో ఆదాయం సమకూరేదన్నారు. అయినప్పటికీ ఈ దర్గాను మాత్రం అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి గతపాలకులనుద్దేశించి విమర్శించారు. ప్రతీసంవత్సరం ఉర్సు ఉత్సవాలకు స్థానికులే కాకుండా ఆయా రాష్ట్రాలకు చెందిన వేల మంది భక్తులు హాజరవుతుంటారని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు నాయకులు కొండల్‌రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, కాశీనాథ్‌రెడ్డి, జమ్రుద్‌ఖాన్, విశాల, వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దర్గాలో చాదర్ సమర్పిస్తున్న నేతలు

విద్యాభివృద్ధికి చేయూతనందించండి



సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతనందించాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని మహాలింగపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన శ్రీ సరస్వతీ దేవి విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుల తల్లి సరస్వతీ అమ్మవారిని ప్రతిఒక్కరూ పూజించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. చిన్నతనం నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి జెడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీటీసీ యాదగిరి, మండల ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినోద్ తెలిపారు. ఎలికట్ట, మహల్‌ఎలికట్ట, మొగిలిగిద్ద, కందివనం, ఎల్లంపల్లి, మహ్మద్‌అలీగూడెం, రంగంపల్లి, ఎలికట్ట ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోండి

తహసీల్దార్ అజీంఅలీ



ఓటర్ లిస్టును చూపిస్తున్న బిఎల్‌ఓలు

కేశంపేట: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అజీంఅలీ పేర్కొన్నారు. ఓటుహక్కు దరఖాస్తుకోసం శనివారం స్పెషల్ క్యాంపెయిన్‌ను మండలంలో నిర్వహించారు. అందులో భాగంగా మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో తహసీల్దార్ అజీంఅలీ పోలింగ్‌బూత్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అబ్బి సుందరయ్య, బిఎల్‌ఓ సుమతి, సూరమోని యాదయ్య, యాదయ్య, బిక్షపతి, శ్రీశైలం, లలిత, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ క్యాటగిరి 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 20 చివరితేదీ ఉండగా దీన్ని మరో మూడు రోజులకు పెంచినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతికి అర్హులని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

బీజేవైఎం అధ్యక్షుడికి అభినందనల వెల్లువ



మహేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

చేవెళ్ల: బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మహేందర్‌ను చేవెళ్లకు చెందిన బీజేపీ, బీజేవైఎం నాయకులు శనివారం నగరంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనంతర్‌రెడ్డి మాట్లాడుతూ ఏబీవీపీలో పనిచేసి ఎన్నో పదవులను బాధ్యతగా నిర్వహించారన్నారు. జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయి పదవికి ఎంపిక కావటం జిల్లాకు, ఈ ప్రాంత నాయకులకు ఎంతో గర్వకారణమన్నారు. ఆయనను కలిసిన వారిలో చేవెళ్ల మండల దళిత మోర్చా అధ్యక్షుడు ఎ అశోక్, బీజేపీ టౌన్ అధ్యక్షుడు జి శ్రీనివాస్‌రెడ్డి, బీజేవైఎం టౌన్ అధ్యక్షుడు బి. చంద్రశేఖర్‌రెడ్డి, గణేశ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ఎస్‌ఐ రాజేందర్, సీఆర్పీ యాదయ్య, డీసీపీయూ అధికారి సంజీవ

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందిస్తారని చేవెళ్ల డివిజన్ ఎస్‌ఐ రాజేందర్, సీఆర్పీ యాదయ్య, డీసీపీయూ అధికారి సంజీవ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లిలో ఆపరేషన్ స్మైల్ ఎక్స్‌లో భాగంగా కుందన్ పరిశ్రమలో లేబర్ క్యాంపులోని 17 మంది వలస కూలీల పిల్లలను తల్లిదండ్రులతో, కంపెనీ వారితో మాట్లాడి చందనవెల్లి పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. బడిఈడు పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని వారు పిల్లల తల్లిదండ్రులతో చెప్పారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు సమకూరుస్తున్నట్లు పేర్కొన్నారు. బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాహేలీల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వలస కూలీల పిల్లలను పాఠశాలలో చేర్పించిన ఎస్‌ఐ రాజేందర్, సీఆర్పీ యాదయ్య, సంజీవ

రాములోరి అక్షితల పంపిణీ

షాబాద్: అయోధ్య నుంచి వచ్చిన రాములోరి పూజిత అక్షితలు ఇంటింటికి పంపిణీ చేస్తున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి హనుమాన్ దేవాయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను శోభాయాత్ర నిర్వహించి, మంగళహరతులతో స్వాగతం పలికి, ఇంటింటికీ అక్షితలను పంపిణీ చేయడం అబినందనీయమన్నారు. భక్తులు పాటలు పాడుతూ ఇళ్లకు వెళ్లి అక్షితలు అందజేశారు. అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ, నిర్మితమవుతున్న శ్రీరామముడి ఆలయ ప్రాణప్రతిష్ఠ సమయంలో వేసిన అక్షితలను దేశ వ్యాప్తంగా అన్ని హిందువుల గృహలకు చేర్చాలని శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో అయోధ్య రామమందిర నిర్మాణం పురస్కారించుకొని గ్రామంలో ఇంటింటికీ శ్రీరామతీర్థ నుంచి వచ్చిన అక్షితలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో యువకులు భక్తి పాటలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఆనంద్, పర్వతాలు, రాఘవేందర్, శివ, నరేందర్, మురళీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కేశంపేట: మహిళలకు అక్షితలను పంపిణీ చేస్తున్న నాయకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతి ప్రదానం చేస్తున్న అంకుర హోమ్స్ యాజమాన్యం

శంకర్‌పల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని అంకుర హోమ్స్ యాజమాన్యం జైపాల్‌రెడ్డి, రవికాంత్ రెడ్డి, వెంకట్‌లు పేర్కొన్నారు. మండలంలోని మోకిల గ్రామంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో అంకురా లిటిల్ చాంపియన్స్ మండల్ లెవల్ వాలీబాల్ టోర్నమెంట్ 2024 ముంగిపు కార్యక్రమానికి వారు విచ్చేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడా కారులకు వారు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో స్నేహ భావం పెరుగుతుందన్నారు. మండల విద్యాధి కారి అక్బర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజునాయక్, సామాజిక కార్యకర్త విఠల్, వార్డు సభ్యుడు విఠల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ఉపాధి హామీకి చట్ట భద్రత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: కాంగ్రెస్ హయాంలోనే ఉపాధిహామీకి చట్ట భద్రత కల్పించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గుర్తు చేశారు. శనివారం కొందుర్గు మండలం బైరంపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకంలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోనియాగాంధీ యూపీఏ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో పేదలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉపాధిహామీకి చట్టం చేసినట్లు చెప్పారు. దీంతో గ్రామాల్లోనే రోడ్లు, కాలువగట్లు, ముళ్లకంచెలు శుభ్రంచేయడం, చెరువు తవ్వకాలు వంటి అత్యవసర పనులను పేదలే నిర్వహించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేవిధంగా చట్టం తీసుకొచ్చారు. దీంతో పనిలేని సమయాల్లో అక్కడే ఉపాధి కలగడంతోపాటు గ్రామాల్లో త్వరిత గతిన అభివృద్ధి జరగడానికి అవకాశాలు మెరుగయ్యాయన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకతీతంగా అందరూ సహకరించాలన్నారు. అనంతరం గుంతలమయమైన రేగడిచిలకమర్రి బీటిరోడ్డును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్ కుమార్, ఎంపీడీఓ ఆంజనేయులు, సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ భారతమ్మ, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, అంజి రెడ్డి, మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పథకంతో మేలు

బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్



మాట్లాడుతున్న శాంతకుమార్

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ సూచించారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్, ముష్టిపల్లి, రావిర్యాల, జిల్లేడ్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా రూ.10లక్షల వరకు ఉచిత ఆరోగ్య సదుపాయం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీనెల ఉచితంగా 5 కిలోల బియ్యం, గర్భిణి, బాలింతలతోపాటు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, 5 ఏళ్ల లోపు బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారి కోసం అటల్ పెన్షన్ పథకం వంటి ఎన్నో పథకాలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఎంపీహెచ్ఈఓ ప్రభులింగం, ఏఈఓ రాజేశ్వరి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్



షాద్‌నగర్ రూరల్: పరీక్ష రాస్తున్న విద్యార్థులు



మొయినాబాద్‌లో

షాద్‌నగర్ రూరల్: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం మండల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 24 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం రమేశ్, గణిత ఫోరం మండల శాఖ అధ్యక్షుడు శ్యాంసుందర్, పాండురంగయ్య, సురేందర్‌రెడ్డి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మండల వనరుల కేంద్రంలో నిర్వహించిన ట్యాలెంట్ టెస్ట్‌కు 14 పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. ఇంగ్లీష్ మీడియంలో వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మెట్టు గాయత్రి ప్రథమస్థానం, పెద్దమంగళారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి గౌతమి ద్వితీయం స్థానం, అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అనుప్రియ, వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నిక్షయ్‌కుమార్ తృతీయస్థానంలో నిలిచారు. తెలుగు మీడియంలో పెద్దమంగళారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన శివకుమార్ ప్రథమ స్థానం, టి మల్లేశ్వరి ద్వితీయ స్థానం సాధించారు. కనకమామిడి, వెంకటాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన పి పల్లవి, జి కార్తీక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమంగళారం హెచ్ఎం రఘునాథ్, గణిత ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు రవికుమార్, నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చైతన్య, లత, నాగేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

చేవెళ్ల: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ జోనల్ సూపర్‌వైజర్ రాములు అన్నారు. చేవెళ్ల మండలంలోని కందవాడ గ్రామంలో శనివారం వైఆర్‌జీకేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో కలిసి సంస్థ సభ్యులు మాట్లాడారు. ఈ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన పద్ధతులను వారు వివరించారు. దీంతో పాటు ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి సోకిన వారిని దూరంగా పెట్టడం వల్ల వారు మానసికంగా కృంగిపోతారన్నారు. సమాజంలో ఈ వ్యాధి పట్ల అపోహలను తొలగించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో కలిసి ఉన్నంత మాత్రాన ఈ వ్యాధి ఒకరినుంచి మరోకరికి సోకదన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్ అనంతలక్ష్మీ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

